క్లుప్తంగా

సోమేష్‌కు అభినందన


మజ్జి సోమేష్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డుకు చెందిన మజ్జి సోమేష్ ఏపీ నగరాల వెల్ఫేర్ అండ్ డెవలప్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితుల య్యారు.దీంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు కూటమి నాయకులు, నగరాల సంఘాల ప్రతినిధులు శనివారం సోమేష్ నివాసానికి వెళ్లి అభినందించారు. నగరాల అభివృద్ధి, సంక్షేమానికి శ్రమిస్తామనని సోమేష్ వివరించారు.

58వ వార్డులో ఫాగింగ్


ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డులోని పలు ప్రాంతాల్లో శనివారం ఫాగింగ్ చేపట్టారు. గుల్లలపాలెం,శ్రీనివాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇటీవల దోమల బెడద ఎక్కువైంది. దీనిపై స్పందించిన వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య సమస్యను మల్కాపురం ప్రాంత మలేరియా విభాగ అధికారి డి.రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో ఆయా ప్రాంతాలకు వచ్చి శనివారం మొబైల్ వ్యాన్ ద్వారా ఫాగింగ్ చేయించారు. దోమల మందును పిచికారీ జరిపించారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ లావణ్య పరిశీలించారు. వార్డు పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలని సూచించారు.

భద్రతా పనులను పర్యవేక్షించిన డీఆర్‌ఎం


భద్రతా పనులను పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఎం లలిత్‌బోహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్‌బోహ్రా డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనులను రాత్రి వేళల్లో సైతం స్వయంగా పర్యవేక్షించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా రాత్రి 11 గంటల తర్వాత రైళ్ల రాకపోకలు తక్కువగా ఉన్న సమయంలో ఈ పనులను ప్రారంభించారు. పెందుర్తి–సింహాచలం పరిధిలో చేపట్టిన బలాస్ట్ క్లీనింగ్ మెషీన్ పనితీరును వీక్షించి, సిబ్బందిని ప్రోత్సాహించారు. నిర్దేశించిన సమయంలో పనులను విజయవంతంగా పూర్తి చేయగలిగారు. ఈ బలాస్ట్ క్లీనింగ్ మెషీన్ తనంతట తానుగా ట్రాక్ నిర్వహణను తెలుసుకుంటూ, అవసరమైన ప్రాంతాల్లో ట్రాక్‌లపై రాళ్ల సరైన పరిమాణంలో సర్దుబాటు చేస్తుంది. మట్టితో కూడిన రాళ్లను తొలగించి శుభ్రపరుస్తుంది.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ తమ రంగాల్లో సాధించిన విజయాలు కళాశాలకు గర్వకారణమన్నారు. పూర్వ విద్యార్థుల విజయాలు ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండి, కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఐసీఐసీఐ బ్యాంక్ చీఫ్ మేనేజర్ బి.మణిమాల, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సువర్ణ, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కె.నాగమణి ఇతర పూర్వ విద్యార్థులు కళాశాలలో తమ అనుభవాలను గుర్తు చేసుకుని, తమ విజయాలు పంచుకోవడంతో పాటు కళాశాల అభివృద్ధికి భవిష్యత్‌లో చేపట్టబోయే ప్రణాళికల గురించి చర్చించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, బోటనీ విభాగం అధ్యాపకురాలు టి.నివేదిత, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ కె.గీతాంజలి, డాక్టర్ ఆర్.కిరణ్మయి, డి.అరుణపద్మ తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కల నెరవేరేనా!


మైదానం ఏర్పాటు చేయాలన్న స్థలం ఇలా...

- డంపింగ్ యార్డుగా మైదానం స్థలం
- పోర్టు అధికారులు సర్వే రాళ్లు వేయడంతో క్రీడాకారుల ఆందోళన

మల్కాపురం: వ్యాయామం.. పరుగు.. క్రీడలు ఏవి సాధన చేయాలన్నా పారిశ్రామిక ప్రాంత వాసులకు ఆ మైదానమే దిక్కు. వసతులు లేకపోయినా అందులోనే సాధన చేసి వివిధ క్రీడల్లో రాణించారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి పతకాలు సాధించారు. 40 ఏళ్ల నుంచి ఈ ప్రాంత వాసులు ఆ స్థలాన్ని వినియోగిస్తున్నారు. అందులో క్రీడా మైదానం నిర్మిస్తామని నాయకులు హామీ ఇవ్వడంతో వారిలో ఆశలు చిగురించాయి. అయితే ఇప్పుడు ఆ స్థలంలో పోర్టు యాజమాన్యం సర్వే రాళ్లు వేయడం.. మరో వైపు డంపింగ్ యార్డులా కొంతమంది చెత్తాచెదారాలతో నింపేశారు. దీంతో తమ కల నెరవేరా మార్గం లేదా అని క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ వీధి నుంచి ప్రకాష్‌నగర్‌కు వెళ్లే మార్గంలో సుమారు 4.60 ఎకరాలు భూమి ఖాళీగా ఉంది. ఈ స్థలం విశాఖ పోర్టు ఆధీనంలో ఉంది. అందులోనే స్థానికులు ఆటలు ఆడుకుంటున్నారు. అయితే 2014 తర్వాత అప్పటి ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ పోర్టు వారితో మాట్లాడి ఆధునిక వసతులతో క్రీడా మైదానం, విశాలమైన వాకింగ్ పార్కు,ఇతర ప్రజాఅవసరాలకు ఉపయోగపడే విధంగా పలు నిర్మాణాలు చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. ఆయన అప్పటి పోర్టు అధికారులతో మాట్లాడి ఇక్కడ స్థలాన్ని తీసుకుని బదులుగా వారికి నగర శివారు ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఇచ్చేందుకు యత్నించారు. నాడు ఆయన సమస్యను అప్పటి కేంద్ర మంత్రి పురంధరేశ్వరి దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు ఆమెను స్వయంగా ఆ స్థలం వద్దకు తీసుకు వచ్చారు. ఆమె కూడా పోర్టు అధికారులతో మాట్లాడి ఈ స్థలాన్ని ప్రజా అవసరాల కోసం ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇంతలో ఎన్నికలు వచ్చి మరలా టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఆ ప్రతిపాదన మాత్రం ముందుకు కదల్లేదు.

ప్రభుత్వ విప్‌కు క్రీడాకారుల వినతి

అందరికీ అందుబాటులో ఉన్న పోర్టు స్థలంలో పారిశ్రామిక ప్రాంత క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా క్రీడా మైదానం నిర్మించాలని రెండు రెలల కిందట ఈ ప్రాంత నాయకులు, క్రీడాకారులు ప్రభుత్వ విప్ గణబాబుకు వినతి పత్రం అందజేశారు. ఆయన స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇంతలో ఏం జరిగిందో పోర్టు అధికారులు మైదాన ప్రదేశానికి వచ్చి పలు చోట్ల సరిహద్దు రాళ్లు వేశారు. ఎప్పుడు లేని విధంగా పోర్టు అధికారులు ఇలాంటి చర్యల తీసుకోవడంతో క్రీడా మైదానం నిర్మాణం అవుతుందా అన్న ప్రశ్న మొదలైంది.

ప్రభుత్వ విప్ దృష్టికి సమస్య



మల్కాపురం,ప్రకాష్‌నగర్ గ్రామాలకు మధ్యలోని పోర్టు స్థలం ప్రభుత్వ స్వాధీనం చేసుకుని క్రీడామైదానం, వాకింగ్ పార్కు, గ్రంథాలయం వంటి నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వ విప్ గణబాబుకు వినతి పత్రం అందించాం. న్యాయం జరుగుతుందని భావించాం. ఇంతలో ఆ స్థలంలో సరిహద్దు రాళ్లు పడడంతో తమ కల నెరవేరుతుందో లేదా అన్న సందేహం కలుగుతోంది.

– ఉరుకూటి బాబూరావు, మల్కాపురం గ్రామ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి

క్రీడలకు చోటేది?



పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల పరిధిలో ఎక్కడా క్రీడా మైదానం లేదు. దీంతో ఈ ప్రాంత వాసులు నగరంలోకి.. జింక్ లేదా షిప్‌యార్డ్ క్రీడామైదానాల వెళ్లి క్రీడల్లో శిక్షణ తీసుకోవాల్సి వస్తుంది. పాలకులు ఈ సారైనా దృష్టి పెట్టి మల్కాపురం వద్ద గల స్థలంలో క్రీడామైదానం నిర్మించాలి.

–ఆకుల కనకరాజు, జాతీయ అథ్లెటిక్ ప్లేయిర్

సరైన మైదానం లేదు



పేరు ఉన్న పారిశ్రామిక ప్రాంతానికి ఒక్క క్రీడామైదానం లేదు. బాక్సింగ్ ప్రాక్టీస్ చేసే రోజుల్లో జింక్ మైదానం వద్దకు వెళ్లేవాడిని. మల్కాపురం,ప్రకాష్‌నగర్ వాసులకు వాకింగ్ పార్కు కూడా లేదు.అధికారులు,పాలకులు సమస్యపై స్పందించి మల్కాపుం వద్ద విలువైన స్థలంలో క్రీడామైదానం,వాకింగ్ పార్కు ఏర్పాటు చేయాలి.

– పంచదార్ల అప్పలరాజుయాదవ్, జాతీయ బాక్సింగ్ ప్లేయిర్

నగరంలోకి వెళ్లాల్సిందే..



మల్కాపురం ప్రాంతంలో సరైన మైదానం లేదు. దీంతో నగరంలోని స్వర్ణభారతి స్టేడియం లేదా జింక్ క్రీడా మైదానాలకు వెళ్లి బాక్సింగ్ ప్రాక్టీస్ చేయాల్సిన పరిస్థితి. అదే మా ప్రాంతంలో ఉంటే మరింత మంది క్రీడాకారులు వెలుగులోకి వస్తారు.

– వాకాడ రేష్మాయాదవ్, ఉమెన్ బాక్సర్

ఆదమరిస్తే అంతే సంగతి


ప్రమాదకరంగా ఉన్న యూజీడీ మూత

జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్ సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్లే మార్గంలో యూజీడీ మ్యాన్ హోల్ మూత ఒరిగి పోయింది. దీంతో ఇది ప్రమాదకరంగా తయారైంది. ఈ దారిలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి సమయంలో దీన్ని గుర్తించకుండా అడుగు వేస్తే ప్రమాదం తప్పదని భయడపతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – గోపాలపట్నం

అండర్ పాస్‌వే పనులకు శంకుస్థాపన


శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న గణబాబు, చిత్రంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

గోపాలపట్నం: కాకానినగర్ వద్ద అండర్‌పాస్‌వే పనులకు ప్రభుత్వ విప్ గణబాబు శనివారం శంకుస్థాపన చేశారు. ఎన్ఏడీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనుల్లో భాగంగా ఇక్కడ ఆర్‌వోబీ నిర్మాణం నేపథ్యంలో కాకానినగర్ వద్ద ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా అండర్‌పాస్‌వే నిర్మాణం చేపడుతున్నారు. ఈ మేరకు పనులను భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ నిధులు రూ12.50 కోట్లతో ఈ పాస్‌వేను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జోనల్ కమిషనర్ హేమావతి, పలువురు కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సందడిగా కిడ్స్ కార్నివాల్

గోపాలపట్నం: శాంతినగర్ వినాయక మండపం వద్ద శనివారం సాయంత్రం చిన్నారులు సందడి చేశారు. పిల్లల కోసం ప్రత్యేకంగా కిడ్స్ కార్నివాల్‌ను శాంతినగర్ యూత్ నిర్వహించారు. యువ నాయకుడు జియ్యాని విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏటా జరిగే వినాయక చవితి వేడుకల్లో సంతృప్తినిచ్చే కార్యక్రమం ఇదన్నారు. పిల్లల నవ్వులు, వారి సందడి ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు. కార్యక్రమంలో పలు రకాల గేమ్స్, షూటింగ్, తినుబండారాలు వంటివి ఉచితంగా అందించారు. స్థానిక చిన్నారుల సంప్రదాయ నృత్యాలు, స్కిట్లు ఆకట్టుకున్నాయి. చిన్నారుల కేరింతలు చూస్తూ, వారి సంతోషాన్ని పంచుకుంటూ తల్లిదండ్రులు కూడా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం బాగుందని, ఏటా ఇలాగే నిర్వహించాలని ఆకాంక్షించారు.


మ్యాజిక్ షోలో పాల్గొన్న చిన్నారులు


కార్యక్రమాలను వీక్షిస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు


శాంతినగర్ వినాయక మండపం వద్ద సందడి

చంద్ర గ్రహణంపై అపోహలు వద్దు


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కు వద్ద శనివారం చంద్ర గ్రహణంపై మూఢనమ్మకాలను పైదొలిగించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం రాత్రి ఏర్పడనున్న సంపూర్ణ చంద్రగహణాన్ని అంతా వీక్షించాలని ,దీనిపై ఎలాంటి అపోహలు వద్దు అని లక్కీ అమర్ పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవ రావు అన్నారు. చంద్రగ్రహణం అంటే కేతువు అనే సర్పం చంద్రుడిని మింగడం వల్ల జరిగే ప్రక్రియ అని అంతా నమ్ముతారు అని, అందులో ఏ మాత్రం నిజం లేదన్నారు.సైన్స్ పరంగా చూస్తే సూర్యుడు, భూమి, చంద్రుడు ఒక వరస క్రమంలో వస్తారని,అప్పుడు సూర్యుడి నీడ చంద్రుడిపై పడకుండా భూమి అడ్డుపడడం వల్ల కొంత భాగం కనపడకుండా పోతుందన్నారు.చంద్రగ్రహణం అనే అద్భుతాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి అరుణ, ములగాడ మండల జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు సుధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబజారులో డస్ట్‌బిన్ల ఏర్పాటు


రైతు బజారులో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజారులో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ స్టాల్ వద్ద తడిచెత్త, పొడిచెత్త విడివిడిగా వేసేలా రెండు బిన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతుబజారులో అత్యధికంగా చెత్త వస్తోందని, వీటి ద్వారా మంచి ఎరువుతో పాటు బయోగ్యాస్ కూడా తయారు చేస్తున్నారని తెలిపారు. రైతులు, వినియోగదారులు పరిశుభ్రతను పాటించాలని, చెత్తను ఎప్పటికప్పుడు బిన్‌లలో వేయాలని కోరారు.

ఒక్క స్వీపర్‌తో అవస్థలు

రైతుబజార్లు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రైతు బజారుల్లో సిబ్బంది ఉదయం నుంచి పరిసరాలు శుభ్రం చేసే పనిలో పడ్డారు. స్వీపర్ ఒక్కరే కావడంతో అటెండర్లతో పాటు ఎస్టేట్ అధికారి సైతం చెత్తను ఎత్తే పని చేపట్టారు. ఈవో మాట్లాడుతూ ఆకస్మికంగా తనిఖీలు చేపడుతున్నారని, మాటపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. అనారోగ్యంతో ఒక స్వీపర్ సెలవులో ఉండడంతో ఒక్క స్వీపర్‌తోనే పని చేయిస్తున్నామని, ఇది చాలా ఇబ్బందిగా ఉంటోందని చెప్పారు.

అభినందన

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అనిమిరెడ్డి వెంకటరమణను శనివారం తోటి ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు అభినందించారు. వెంకటరమణ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం శుక్రవారం అందుకున్నారు. ఆయన్ను తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుబజారును సందర్శించిన ఇంజినీరింగ్ అధికారులు


గోపాలపట్నం రైతు బజారులో పర్యటిస్తున్న ఎస్ఈ శేషగిరిరావు తదితరులు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారును శనివారం మార్కెటింగ్ శాఖ ఎస్ఈ శేషగిరిరావు, ఇంజినీరింగ్ అధికారులు సందర్శించారు. రైతు బజారులో శిథిలావస్థకు చేరిన స్టాళ్లను, మరుగుదొడ్లు ఏవిధంగా ఉన్నాయో ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజార్లను ఆధునికీకరించే పనుల్లో భాగంగా ఏ బజారులో ఎలాంటి పనులు చేపట్టాలో నివేదిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. గోపాలపట్నం బజారులో కొన్ని స్టాళ్లు నిర్మించాల్సి ఉందని.. అలాగే వెలుపల రైతు బజారు స్థలంలో కొన్ని స్టాళ్ల ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉందన్నారు. సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆయనతో పాటు ఈఈ వెంకటేశ్వరరావు, డీఈలు కెనడి, శ్రీనివాసరావు, రైతుబజారులు ఎస్టేట్ అధికారి ప్రసాద్, సహాయకులు శివ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

కారులో వ్యక్తి మృతి


డ్రైవింగ్ సీట్‌లో కుప్పకూలిపోయిన సుఖదేవ్

గోపాలపట్నం: కారు డ్రైవింగ్ సీటులో వ్యక్తి మృతి చెందిన ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి మర్రిపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిపాలెం ప్రధాన రహదారిలోని బార్ అండ్ రెస్టారెంట్ వద్ద కార్లో వ్యక్తి కదల్లేని విధంగా ఉన్నాడని పోలీసులకు స్థానికులు సమాచారమందించారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు కారులో ఉన్న వ్యక్తిని పరిశీలించారు. వివరాలు సేకరించారు. సుఖదేవ్ స్వయిన్ జగత్సింగపూర్ బడసరోల్ సర్డోల ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సుఖదేవ్ ప్రస్తుతం కాకానినగర్‌లో కుటుంబంతో నివాసముంటున్నాడు. హిందుస్తాన్ షిప్ యార్డు షిప్ బిల్డింగ్ సెంటర్‌లో ఎల్‌డీసీగా ఉద్యోగం చేస్తున్నాడు. నిత్యం మద్యం తాగుతూ ఉంటాడని చెబుతున్నారు. అతిగా మద్యం సేవించడం వల్లే చని పోయి ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

ఘనంగా ఓనం వేడుకలు


సంప్రదాయ వస్త్రాలంకరణలో కళాశాల అధ్యాపకులు


ఓనం సంప్రదాయ ముగ్గు వేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం సాయంత్రం ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు కేరళ సంప్రదాయ వస్త్రధారణలో కార్యక్రమానికి హాజరయ్యారు. కళాశాల ప్రాంగణంలో రంగురంగుల పూలతో రంగవల్లులను అలంకరించి, సంప్రదాయ ఓనం నృత్యాలను ప్రదర్శించారు. ఈ వేడుకలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. సీనియర్ అధ్యాపకులు ఓనం పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

మల్కాపురం

ట్రంప్ సుంకాలపై కూటమి వైఖరి స్పష్టం చేయాలి

వామపక్ష పార్టీల డిమాండ్


నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ దేశంలో భారతీయ సరకుల దిగుమతిపై 50 శాతం సుంకాలు విధించడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తూ, ట్రంప్ సుంకాలను తక్షణం రద్దు చేయాలని, సుంకాలపై మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తమ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహిమాన్, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి తదితరుల ఆధ్వర్యంలో ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రహిమాన్, మణి మాట్లాడుతూ అమెరికా విధించిన సుంకాల వల్ల భారతీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. మోదీ, చంద్రబాబు, పవణ్‌కళ్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, వామపక్ష పార్టీల నాయకులు ఎం.సుబ్బారావు, ఎం.మన్మథరావు, కె. దేవా, సీఎస్ క్షేత్రపాల్, ఎంఎస్ పట్నాయిక్, కె. సత్యనారాయణ, జీవీఎం రెడ్డి, ఎండీ బేగం, కొండమ్మ, కె. వనజాక్షి, వెంకటరావు, ఎ. దేముడమ్మ, వై. రాంబాబు,ఎం శ్రీనివాసరావు పలువురు వామపక్ష పార్టీల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ


తులసిపూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచా మృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వ హించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపా రు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్ సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్ర కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.